క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని లక్ష్మీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడానికి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆత్మకూర్ రామాగౌడ్ తన తండ్రి ఆత్మకూర్ కిష్టాగౌడ్ జ్ఞాపకార్థం అంబలి కేంద్రం ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు సత్యనారాయణ, శివరాజ్ పాటిల్, శ్రీశైలం, కలీమ్, నర్సింహాగౌడ్, విజయ్‌కుమార్, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని కర్చల్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దత్తురెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి యువకుల నుంచి సోమవారం అనూహ్య స్పందన లభించింది. వచ్చింది. టీడీపీ నాయకుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి వివిధ గ్రామానలకు చెందిన యువకులు తరలి వచ్చి రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు తమ వంతు కృషిగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని మహిపాల్‌రెడ్డి తెలిపారు. రక్తదానం చేసిన 33 మంది యువకులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, బీజేపీ మండల నాయకులు వీరప్పపాటిల్, రాజేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



బహుమతులను ప్రదానం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. బీజేపీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 18 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో రాళ్లకత్వ గ్రామానికి చెందిన జట్టు మొదటిస్థానంలో నిలువగా ఊట్ల గ్రామానికి చెందిన జట్టు రన్నరప్‌గా నిలిచింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళా మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా మకరజోలకు చెందిన మోహిని చిన్న కూతురు తోయాజాక్సి పటాన్‌చెరు మండలం.. పాశమైలారంలోని పరిశ్రమలో హెచ్‌ఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఇస్నాపూర్‌లో సాయి సుదర్శన్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. అయితే 2021లో అదే జిల్లాకు చెందిన విజయ్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో అదే జిల్లా సువర్ణపురానికి చెందిన కిరణ్‌కుమార్ నిన్ను ప్రేమించాను.. నీ భర్తకు విడాకులు ఇచ్చి వస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రతిరోజు ఫోన్ చేస్తూ మెసేజ్‌లు పంపుతుండేవాడు. ఇది నమ్మిన తోయజాక్సీ తన భర్త విజయ్‌కు 2023 డిసెంబర్‌లో విడాకులు ఇచ్చింది. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని కిరణ్ కుమార్‌ను అడగగా నాకు వేరే అమ్మాయితో పెళ్లి కుదిరిందని మాట మార్చాడు. దీంతో మనస్తాపం చెందిన తోయాజాక్సీ ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. గమనించిన తోటి ఉద్యోగి విజయభాస్కర్ అనే వ్యక్తి చికిత్స కోసం తోయాజాక్సిని కాకతీయ ఆస్పత్రికి తరలించాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. కిరణ్‌కుమార్ పెళ్లి చేసుకుంటానని మోసం చేసినందుకే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి మోహిని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లర్లకే పరిమితం

- అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- సూపర్ మార్కెట్, వారాంతపు సంతలను ఆశ్రయిస్తున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

అన్ని వస్తువులు ఒకేచోట లభించే విధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ గత ప్రభుత్వం నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అన్ని వస్తువులు అంటే కూరగాయలు, వివిధ రకాల మాంసం, పండ్లు, పూలు, నిత్యవసర సరుకులు లభించేవిధంగా ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాలను నిర్మించేందుకు తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును నిర్మించేందుకు రూ.2కోట్ల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేసి నిర్మాణాలను చేపట్టారు. కానీ.. రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



పిల్లర్ల దశలో నిలిచిపోయిన తెల్లాపూర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపాలిటీలలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం మున్సిపల్ నిధులను ఎందుకు కేటాయించడం లేదని, ప్రజలకు అత్యవసరమైన మార్కెట్ యార్డు నిర్మాణ పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి మధ్యలోనే ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతోనే పనులకు బ్రేక్!

మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల పనులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలో ఎన్నికల సమయం రావడం.. ఆతర్వాత ప్రభుత్వం మారడంతో మార్కెట్ నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకే పనులు నిలిచిపోయాయని ప్రచారం జరుగుతోంది.

పనులు పూర్తి చేయాలి



మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ యార్డు లేకపోవడంతో సూపర్ మార్కెట్లలో లభించే నిత్యవసర వస్తువులను అధిక ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటిగ్రెటెడ్ మార్కెట్ యార్డు పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

– రామ్‌కుమార్, ఉస్మాన్‌సాగర్

అందుబాటులోకి తెస్తాం



తెల్లాపూర్‌లో మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీలైనంతవరకు నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– సంగారెడ్డి, కమిషనర్, తెల్లాపూర్ మున్సిపల్

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఓటర్లను కోరారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండల పరిధిలోని హుస్సెన్ నగర్, చీకూర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజన్‌వాడ, చాల్కి, రాఘవాపూర్, చాల్కి, హుమ్నాపూర్ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా తమ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నమ్మి మోసపోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త దేవిప్రసాద్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు రవిందర్, నాయకులు, ప్రజాప్రతినిధులు భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీపతి, రాజేందర్‌రెడ్డి, సంగ్రాం పాటిల్, హనీఫ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం.. తుల్జా భవానీ క్షేత్రం

- నేటి నుంచి జాతర ప్రారంభం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు

మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయం గొప్ప ప్రసిద్ధి. అంతటి చరిత్ర కలిగిన ఆలయం జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం ఖంజమన్‌పూర్(భవానమ్మపల్లి)లోనూ ఉంది. తుల్జా భవానీమాత మందిరాన్ని ఛత్రపతి శివాజీ మహారాజ్ నిర్మించారని చరిత్ర చెబుతోంది. ప్రతి పౌర్ణమికి భక్తుల సందడి నెలకొంటుంది. దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలను కూడా ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– జహీరాబాద్ టౌన్



ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయం

ఆలయ చరిత్ర

ఖంజమల్‌పూర్‌లోని తుల్జాపూర్ భవానీమాత ఆలయం సుమారు 500 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ ఆలయాన్ని ఛత్రపతి శివాజీ మహరాజ్ నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. యుద్ధానికి వెళ్లే సమయంలో ఆయన ఖంజమల్‌పూర్‌లో సేదతీరినట్లు, యుద్ధభూమిలో విజయం సాధించిన తరువాత ఆయన ఇక్కడ మందిరాన్ని నిర్మించారని చరిత్రలో పేర్కొన బడింది. అమ్మవారి ఆలయాన్ని ప్రాచీన పద్ధతిలో కట్టించి చుట్టూ కందకం తవ్వించారు. గుడి పక్కనే పెద్ద సొరంగ మార్గం ఉంది. పునురుద్ధరణ పనులు చేపడుతుండగా సొరంగ మార్గం బయటపడింది. భూమి లోపల గదులాంటి నిర్మిణాలు ఉన్నాయి. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. జహీరాబాద్ నుంచి భక్తులు పాదయాత్రన వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన తుల్జాభవానీ ఆలయ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ముస్తాబైన ఆలయం

తుల్జా భవానీమాత ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, జెండావిష్కరణ, ధ్వజారోహణం, అమ్మవారికి కుంకుమార్చన, బోనాల ఊరేగింపు, పల్లకీ సేవా ఊరేగింపు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన బాలుడిని గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌కు చెందిన ఆగమ్మ పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలో బిక్షాటన చేసుకుంటూ స్థానికంగా ఉన్న హోటల్ ముందు పడుకునేది. వారం రోజుల క్రితం ఆమె పెద్ద కుమారుడు రమేష్ కొడుకు నగేష్(8) ఆమె వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వర్షం వస్తున్న సమయంలో బాలుడు బాత్రూం వస్తుందని చెప్పడంతో పక్కనే ఉన్న చెట్లలోకి వెళ్లమని ఆగమ్మ చెప్పి పడుకుంది. తెల్లవారుజామున చూసేసరికి మనవడు కనిపించలేదు. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో ఉన్న బాలుడిని పోలీసులు పట్టుకొని ఆగమ్మకు అప్పజెప్పారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



డీసీఎం నుంచి రోడ్డుపై పడిన గడ్డిమోపులు

హత్నూర(సంగారెడ్డి): డీసీఎం వాహనంలో తీసుకెళ్తున్న గడ్డివాములు ఒక్కసారిగా వెనుక నుంచి వస్తున్న కారుపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ చౌరస్తాలో సోమవారం చోటుచేసుకుంది. నర్సాపూర్ వైపు నుంచి సంగారెడ్డికి వెళ్తున్న గడ్డి డీసీఎం దౌల్తాబాద్ చౌరస్తాకు రాగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద తాడు తెగిపోయింది. దీంతో గడ్డిమోపులు కారుపై పడడంతో ఏం జరిగిందో అని అందరూ ఆందోళన గురయ్యారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



గోపాల్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎంఈఓ అంజయ్య, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్‌గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్రు రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన గోపాల్ పదవీ విరమణ సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతకు గోపాల్ మారుపేరు అని, విద్యార్థుల హృదయాల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు సంగమేశ్వరరెడ్డి, నర్సింహులు, రామకృష్ణ, శ్రవణ్, ప్రవీణ్, దయానంద్, అక్బర్, శివకుమార్, మల్లేశం, జర్దయ్య, ప్రవీన్‌కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, వెంకటేశ్వర్లు, గోవిందరావు, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నా గెలుపునకు కృషి చేయాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు



నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చిన నీలం మధును కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన ఘనంగా సన్మానించారు.

రాజీనామా చేసి పార్టీలు మారాలి

బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జోగిపేట(అందోల్): బీఆర్‌ఎస్ బీ ఫారంపై గెలుపొందిన నాయకులు ఆ పదవులకు రాజీనామా చేసి ఇతర పార్టీల్లో చేరాలని, రాజీనామాలు చేయకుండా పార్టీలు మారడం సరికాదని జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మల్లికార్జున్, డీబీ నాగభూషణం అన్నారు. జోగిపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నుంచి గెలిచి పదవులను కాపాడుకోవడం కోసం పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు వీరభద్రరావు, వెంకటేశం, సంతోష్, మహేష్‌యాదవ్, శంకర్, అశోక్, నాగరాజు, సుధాకర్‌గౌడ్, సత్యం, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించండి

కంగ్టి(నారాయణఖేడ్): రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కంగ్టిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఖేడ్ ఇన్‌చార్జి మఠం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షులు గంగారాం, కోట అంజనేయులు, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సిద్దు, అంబాజీ, సాయిలు, సంజుపాటిల్ పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): పీఏసీఎస్ ఆధ్వర్యంలో కల్హేర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఓ శశాంక్ సోమావారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా రైతులకు ఏఈఓలు టోకెన్లు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ భాస్కర్, సొసైటీ డైరెక్టర్ బేగరి సాయిలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన కూని పాపయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం అంబేడ్కర్ సంఘం సభ్యులు రూ. 12 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, సంఘం సభ్యులు బాల్‌రాజ్, సత్యం, కృష్ణ, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీలో చేరిక**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. నాగల్‌గిద్ద మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పండరి యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ్ కులకర్ణి, మండల బీఆర్‌ఎస్ కార్యదర్శి మారుతి యాదవ్, శర్ణప్ప, తుకారాం, బలరాం తమ అనుచరులతో బీజేపీలో చేరారు. పార్టీలో చేరినవారికి ఎంపీ బీబీ పాటిల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగల్‌గిద్ద జెడ్పీటీసీ రాజురాథోడ్, బీజేపీ జిల్లా నాయకులు రామకృష్ణ, బస్వరాజ్, మారుతి పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి.**

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని మనియార్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ జగన్నాథ్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, రాచన్నస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజుస్వామి పాల్గొన్నారు.

◆ **విద్యుత్ అంతరాయం**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం వర్షం పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.55 గంటల వరకు సరఫరా లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

◆ **మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాప్**

జహీరాబాద్ టౌన్: మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్ అని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం రాత్రి జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

◆ **దివ్యాంగుల ఓటరుచైతన్య ప్రదర్శన**

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల్లో దివ్యాంగ ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం కల్పిస్తున్న సదుపాయాలను గురించి వివరిస్తూ సోమవారం ఖేడ్‌లో వివిధశాఖల అధికారులతో కలిసి దివ్యాంగులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, మున్సిపల్ మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘ జిల్లా కోశాధికారి ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, ఇతర బాధ్యులు ఫర్జానా, అనిత, గాలయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

◆ **వీరభద్రేశ్వర స్వామి జాతర ప్రారంభం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెరియంపూర్ గ్రామ సమీపంలో ఉన్న వీరభద్రేశ్వర ఆలయంలో జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా మొదటి రోజైన సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **ఘనంగా యాన్యువల్ డే వేడుకలు**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం యాన్యువల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్ వైజర్ ఉమారాణి హాజరై పూర్వ ప్రాథమిక విద్య స్థాయిలో సాధించిన ఘనతను చాటి చెప్పేందుకు అబ్జర్వేషన్ బుక్స్, అసెస్మెంట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **డిగ్రీ విద్యార్థిని అదృశ్యం**



పటాన్‌చెరు టౌన్: డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన అంకిత కూకట్‌పల్లిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అంకిత తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అంకిత కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మనవరాలు అదృశ్యంపై నానమ్మ విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల పరిధిలోని సక్రునాయక్ తండాలో సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారి వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏఈవో సంతోష్, ప్రవంతి, నిర్వాహకులు రాజు, కమల్‌సింగ్ పాల్గొన్నారు.

◆ **ముగిసినా మహోత్సవాలు**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు అమరేందర్‌రెడ్డి, గంగన్న, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ శ్రేణుల ప్రచారం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గంగ్వార్, న్యాల్‌కల్, టేకూర్, వడ్డి తదితర గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చినిగెపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ నాయకులు నసీంపటేల్, రఫీయోద్దీన్‌ల ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మెన్ సిద్దిలింగయ్యస్వామి, హజ్‌పటేల్, రాములు పాల్గొన్నారు.

◆ **కోహీర్ మండల పరిధిలో...**

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని మనియార్‌పల్లి గ్రామ నివాసి దళిత యువ నాయకులు, అమర్‌నాథ్ మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి చెంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, వైస్ ఎంపీపీ షాకీర్ అలీ, పైడిగుమ్మల్ ఎంపీటీసీ జ్ఞానరత్నం, నాయకులు మూర్జల్, మధుకర్, ప్రవీన్‌కుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

◆ **వ్యక్తి అదృశ్యం**

జిన్నారం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండల పరిధిలోని నల్తూర్ గ్రామంలో నక్కిర్తి ఈశ్వరయ్య ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఈశ్వరయ్య కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, ఈశ్వరయ్య ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి అందజేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

◆ **బీజేపీ శ్రేణులపై కేసు నమోదు**

సంగారెడ్డి టౌన్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కలెక్టరేట్‌లోకి సుమారు 50 మంది బీజేపీ శ్రేణులు ప్రవేశించి మీడియా పాయింట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దేవదాసు మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘించకూడదని ఎంత చెప్పినా వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.